సాక్షి
విశాఖపట్నం
శనివారం । 6 । ఏప్రిల్ । 2024



ఘనంగా మారిటైం వేడుకలు

విశాఖ పోర్టు అథారిటీలో జాతీయ మారిటైం దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. IIలో



రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా స్టేషన్ల మధ్య స్పెషల్ రైళ్లు (వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నారు. IIలో



టిడ్కో.. IIలో

న్యూస్‌రీల్

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ



అధ్యక్షుడు బెవర సత్యనారాయణ



ప్రధాన కార్యదర్శి డి.నరేష్‌కుమార్

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది బెవర సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారి కేశ ప్రగడ వెంకట నరసింహమూర్తి ఫలితాలను ప్రకటించారు. న్యాయవాదుల సంఘానికి గురువారం ఎన్నికలు జరిగాయి. మొత్తం 2,866 మందికి గాను 2,141 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా డి.నరేష్‌కుమార్, ఉపాధ్యక్షునిగా ఈమంది శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా అడపా సుధాకర్, కోశాధికారిగా అశోక్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి కర్రి మాధవిలత, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా సింహాద్రి యాదవ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా ఆదారి అప్పారావు ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బెవర సత్యనారాయణను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ఇతర న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. తనను 995 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించిన న్యాయవాదులందరికి బెవర సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన అజెండాగా పనిచేస్తానని చెప్పారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా కృష్ణమోహన్



విశాఖ లీగల్: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది సిరిపురపు కృష్ణమోహన్ ఎన్నికయ్యారు. విజయవాడ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో శుక్రవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కృష్ణమోహన్‌ను ఉపాధ్యక్షుడిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2001 నుంచి కృష్ణమోహన్ బార్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 15 ఏళ్లుగా క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సేవలందిస్తున్న కృష్ణ మోహన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, న్యాయవాది బీవీఆర్ మూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కాగా.. బార్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా నల్లారి ద్వారకానాథ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు


విశాఖ లీగల్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.సుమతి శనివారం విశాఖ వస్తున్నారు. వందేభారత్ రైలులో శనివారం విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. 7న భీమిలిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం విమానంలో విజయవాడ వెళతారు.

ఉడుకుతున్న విశాఖ



- 44 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- మాడుగులలో 43.8, భీమిలిలో 43 డిగ్రీలు
- అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో తీవ్ర వడగాడ్పులు

సాక్షి, విశాఖపట్నం: అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో విశాఖ జిల్లా ఉడుకుతోంది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణతాపం తన ప్రతాపాన్ని చూపుతోంది. ఏప్రిల్ ఆరంభంలోనే మే నెల ఎండలు, వడగాడ్పులను తలపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా రాయలసీమలో ఉష్ణోగ్రతలతో పోటీ పడుతోంది. ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరువవుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం అనకాపల్లి జిల్లా మాడుగులలో అత్యధికంగా 43.8 డిగ్రీలు, విశాఖ జిల్లా భీమిలి మండలం నారాయణరాజుపేటలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఫలితంగా విశాఖ జిల్లాలో ఐదు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, అనకాపల్లి జిల్లాలో 15 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, ఆరు మండలాల్లో వడగాడ్పులు, అల్లూరి జిల్లాలో మూడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 10 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. సాధారణంగా ఇలాంటి అధిక ఉష్ణోగ్రతలు మే నెల మధ్యలో అరుదుగా నమోదవుతుంటాయి. కానీ నెల రోజులు ముందుగానే ఆ వాతావరణం ఏర్పడడంతో ముున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. వీటిని తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే వేడి గాలులు మొదలై సాయంత్రం పొద్దుగుంకే వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. వీటికి తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉంటూ మరింత ఇబ్బంది పెడుతోంది.



శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	మాడుగుల	43.78
అనకాపల్లి	రావికమతం	43.75
అనకాపల్లి	దేవరాపల్లి	43.44
అనకాపల్లి	కోటవురట్ల	43.39
అనకాపల్లి	చోడవరం	43.26
విశాఖపట్నం	భీమిలి	43.0
విశాఖపట్నం	పద్మనాభం	42.53
విశాఖపట్నం	గంభీరం	41.64
ఏఎస్సార్	కూనవరం	41.40
ఏఎస్సార్	మారేడుమిల్లి	40.52
ఏఎస్సార్	చింతూరు	40.0



ఎండలో చాపలు అమ్ముతున్న వ్యాపారి

రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు విజృంభించనున్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం శనివారం అల్లూరి జిల్లాలో అడ్డతీగల, అనంతగిరి, చింతూరు, కూనవరం, గంగవరం–2, రాజవమ్మంగి, వరరామచంద్రపురం, రంపచోడవరం మండలాలు, అనకాపల్లి జిల్లాలోని బుచ్చయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, గొలుగొండ, కె.కోటపాడు, కశింకోట, కోట ఉరట్ల, మాడుగుల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, రావికమతం, రోలుగుంట, సబ్బవరం మండలాలు, విశాఖ జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో తీవ్ర వడగాడ్పులకు ఆస్కారం ఉంది. ఆయా మండలాల్లో 41–44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని అంచనా వేసింది.

బండారుకు ఇస్తే తడాఖా చూపిస్తా..

- మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు ఫోన్
- విషయం తెలుసుకొని మండిపడిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్
- బండారు కంటే ముందే మా కుటుంబం రాజకీయాల్లో ఉందన్న పీలా



సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతున్నా.. కూటమిలో టికెట్ల పంచాయితీ నివురు గప్పిన నిప్పులా రాజుతూనే ఉంది. పొత్తుల ఎత్తులతో జిత్తులమారిలా వ్యవహరిస్తున్న చంద్రబాబు సీనియర్ల సీటుకు ఎసరు పెట్టేశారు. పెందుర్తిలో బండారుకు, అనకాపల్లిలో పీలాకు వెన్నుపోటు పొడిచిన బాబు.. ఇప్పుడు మందు రాసేందుకు చేస్తున్న ప్రయత్నాలు మరింత తలనొప్పిగా మారుతున్నాయి. మాడుగుల సీటును బండారుకు ఇద్దామన్న సంకేతాలు వినిపిస్తుండటంతో మరో సీనియర్ పీలా మండిపడుతున్నారు. తనని కాదని బండారుకు సీటెలా ఇస్తారో చూస్తానంటూ అధిష్టానానికి సవాల్ విసురుతున్నారు.

మాడుగులలో బండారు పోటీపై సర్వే

పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేన అభ్యర్థి పంచకర్లకు కట్టబెట్టడంతో బండారు సత్యనారాయణ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. బయటకు టీడీపీతోనే పయనమని చెబుతున్నా.. పంచకర్లకు సహకరించకుండా తటస్థంగా ఉండిపోతారన్న వార్తలు వస్తుండటంతో.. సర్దుబాటు చేసే ప్రయత్నాల్ని చంద్రబాబు ప్రారంభించారు. మరోవైపు అనకాపల్లి సీటును కూడా జనసేనకు త్యాగం చేయడంతో అక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా వర్గం రగిలిపోతోంది. పీలాని పిలిచి.. బుజ్జగించి.. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అసంతృప్తులకు చెప్పిన ఎమ్మెల్సీ మంత్రాన్ని జపించడంతో.. బాబు మాటలు నమ్మి స్తబ్దుగా ఉందామని పీలా భావించారు. కానీ.. ఇంతలోనే మరో వార్త పీలా వర్గానికి మింగుడు పడకుండా చేస్తోంది. సీట్ల మార్పులో భాగంగా.. మాడుగుల టికెట్‌ని బండారుకు ఇస్తే ఎలా ఉంటుందన్న సర్వేలు, జిల్లా టీడీపీ నేతల అభిప్రాయాల్ని అధిష్టానం సేకరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు నుంచి ఫోన్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆ నోటా ఈ నోటా నానుతూ పీలా గోవింద్ సత్యనారాయణ చెవిలో పడటంతో సీన్ రివర్స్ అవుతోంది.

మా కుటుంబమే రాజకీయాల్లో ముందు

చంద్రబాబు వైఖరిపై పీలా గోవింద్ మండిపడుతున్నారు. సీటు ఇవ్వకుండా మోసం చేయడం ఒక ఎత్తయితే.. తన జిల్లాలో తనకు కాకుండా ఇంకొకరికి సీటు ఎలా ఇస్తారంటూ అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లిలో సీటు ఆశించి భంగపడ్డ తనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా బండారుకు ఎలా ఇస్తారంటూ చంద్రబాబుని పీలా ప్రశ్నిస్తున్నారు. అసలు రాజకీయాలు బండారు ఇంట్లో ముందు పుట్టాయా..? మా ఇంట్లో ముందు పుట్టాయా అంటూ టీడీపీ శ్రేణుల వద్ద పీలా ఆక్రోశం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. బండారు నుంచి వారి కుటుంబంలో రాజకీయాలు మొదలయ్యాయి.. మా తాతల కాలం నుంచి మా ఇంట్లో రాజకీయాలు ఉన్నాయి. అలాంటప్పుడు తనని కాదని వేరే వాళ్లకు టికెట్ ఇస్తే సహించేది లేదని.. అధిష్టానానికి పీలా తెగేసిచెప్పినట్లు తెలుస్తోంది. ఒకవేళ టికెట్ బండారుకే ఇస్తే ఎలా గెలుస్తారో తాను చూస్తానని పీలా సవాల్ విసిరినట్లు సమాచారం. ఇప్పటికే అనకాపల్లి టికెట్ ఇవ్వకపోవడంతో అయోమయంలో ఉన్న పీలా వర్గం.. ఇప్పుడు మరో వెన్నుపోటుతో చంద్రబాబు వైఖరిపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

స్ఫూర్తి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బాబూరావు, ఎమ్మెల్సీ కల్యాణి, కోలా గురువులు, మేయర్ హరివెంకటకుమారి

మహారాణిపేట: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని కలెక్టర్ ఎ.మల్లికార్జున కొనియాడారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివంగత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ 117వ జయంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వం కలిగి ఉండాలనే లక్ష్యంతో బడుగు వర్గాలతో పాటు స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని చెప్పారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయం

కొమ్మాది: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి బాబూరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా పార్టీ కార్యాలయానికి వచ్చిన బాబూరావును సత్కరించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నియోజకవర్గ పరిశీలకురాలు పీలా ఉమారాణి, నాయకులు వంకాయల మారుతీప్రసాద్, రామన్నపాత్రుడు, అల్లంపల్లి రాజబాబు, అప్పన్న, వానపల్లి ఈశ్వరరావు, దాసరి రమేష్, మల్లేశ్వరి, పిల్లా సుజాత, సత్యనారాయణ, దేవరకొండ మార్కండేయులు, డేవిడ్, వై.స్వర్ణమణి పాల్గొన్నారు.

చంద్రబాబూ.. ఆర్యవైశ్యులతో పెట్టుకోవద్దు

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు హెచ్చరిక
- గంజాయి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎం.వి.సత్యనారాయణ

సీతమ్మధార: కిరాణా దుకాణాల్లో గంజాయి దొరుకుతుందా అని రావులపాలెంలో జరిగిన సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించడంపై ఆర్యవైశ్యులు అభ్యంతరం తెలిపారు. చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోకపోతే.. ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ ఏపీ ఉపాధ్యక్షుడు ఎం.వి.సత్యనారాయణ హెచ్చరించారు. సీతమ్మధారలో ఆక్సిజన్ టవర్స్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైశ్యుల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు మాట్లాడారని మండిపడ్డారు. రాష్ట్రంలోని 15 వేల నుంచి 20 వేల వరకు ఉన్న కిరాణా దుకాణాల్లో హెరిటేజ్ పాలు, అనుబంధ ఉత్పత్తులు విక్రయించకపోతే చంద్రబాబు వ్యాపారం ఏమైపోతుందో ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆర్యవైశ్యుల భిక్షతో చాలా మంది పదవులు అనుభవిస్తున్నారన్నారు. రావులపాలెంలో ఇప్పటికే చంద్రబాబుపై ఆర్యవైశ్యులు ఫిర్యాదు చేసి ఆందోళనకు దిగారన్నారు. బాబు వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్ : వేసవి క్రికెట్ శిబిరాల్లో పాల్గొనేందుకు ఎంపికలు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరగనున్నాయి. దరఖాస్తులను ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు వైఎస్సార్ స్టేడియంలోని వీడీసీఏ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. అండర్ 10, 12 కేటగిరిల్లో ఎంపికలను 18, 19వ తేదీల్లోను, అండర్ 14, 16 కేటగిరిల్లో 20, 21వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఎంపికైన వారికి మే మొదటి వారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది.

7,8 తేదీల్లో పవన్ యాత్ర

సాక్షి, విశాఖపట్నం : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల పర్యటన ఖరారైంది. వారాహి విజయయాత్ర పేరిట ఆయన ఎన్నికల సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తొలుత ఈనెల 5 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆయన పర్యటించాల్సి ఉంది. అయితే పిఠాపురం ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనకు జ్వరం సోకడంతో హైదరాబాద్ వెళ్లిపోయారు. దీంతో పవన్ పర్యటన వాయిదా వేశారు. తాజాగా ఈనెల 7న అనకాపల్లి, 8న యలమంచిలి నియోజకవర్గాల్లో పవన్ ఎన్నికల సభల్లో పాల్గొంటారని జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో సభలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొంది.

మళ్లీ అవ్వాతాతలకు పండగే

- వచ్చేది మన ప్రభుత్వమే..
- వలంటీర్ల సేవలు ఆగవని సీఎం జగన్ స్పష్టీకరణ
- ఆయన తొలి సంతకం ప్రకటనపై సర్వత్రా హర్షం
- ఊరట చెందుతున్న పండుటాకులు
- మళ్లీ ఇంటికే పెన్షన్లు అందుతాయంటూ సంబరం
- ప్రభుత్వ చొరవతో ముగింపు దశకు చేరుకున్న పింఛన్ల పంపిణీ



వన్‌టౌన్ మౌలాలీపంజాలో బొర్రా లక్ష్మి ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్న కార్యదర్శి

సాక్షి, విశాఖపట్నం : గత 58 నెలల నుంచి వలంటీర్లే వచ్చి ఇళ్ల వద్దనే పెన్షన్లు ఇచ్చారు.. ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే పెన్షను సొమ్ము వారి చేతిలో పెట్టేవారు.. పిసరంత కష్టం లేకుండా రూ.3 వేలు అందుకుంటున్న అవ్వా, తాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందానికి అవధులు ఉండేవి కావు.. ఈ వ్యవస్థ సాఫీగా కొనసాగుతుండగా చంద్రబాబు కుటిల రాజకీయం వీరి పాలిట శాపంగా మారింది. వీరికి వలంటీర్లు పెన్షను సొమ్ము ఇవ్వకుండా అడ్డుపడ్డారు. వలంటీర్ల వ్యవస్థకు తాత్కాలికంగా బ్రేకులు వేశారు. వడగాడ్పులు వీస్తున్న ప్రస్తుత తరుణంలో అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు మరొకరిని వెంటబెట్టుకుని వెళ్లి పింఛను తీసుకోవలసిన పరిస్థితి దాపురించింది. ఆటోలకు రానుపోను చమురు వదిలించుకోవలసి వస్తోంది. దీనికంతటికీ కారణం చంద్రబాబు అండ్ కో అని తెలుసుకున్న పండుటాకులు, దివ్యాంగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమం కోరుకునే వారే నిజమైన పాలకులు, ప్రజా సేవకులు అవుతారు తప్ప ఇలా తిప్పలు పెట్టేవారు కాదంటూ నిప్పులు చెరుగుతున్నారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రకటన వీరికి ఎంతో ఊరటనిచ్చింది. వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని, వారి సేవలు ఆగవని, యథావిధిగా వాళ్లే ఇంటింటికి పెన్షను తెచ్చి ఇస్తారని, మళ్లీ అధికారంలోకి వచ్చాక తన తొలి సంతకం ఆ ఫైల్ పైనేనని నాయుడుపేట బహిరంగ సభలో స్పష్టం చేశారు. దీంతో జగన్ మళ్లీ సీఎం అయ్యాక ఎప్పటిలాగానే వలంటీర్లు ఇంటికే వచ్చి పెన్షను ఇస్తారని అవ్వా తాతలు, దివ్యాంగులు మురిసిపోతున్నారు. ఈ విషయాన్ని వీరు సాటి వారికి చెప్పుకుని తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని సీఎం చేసిన ప్రకటనపై వలంటీర్లలోనూ ఆనందం వ్యక్తమవుతోంది.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

వృద్ధులు, దివ్యాంగుల కష్టాలను ముందుగానే గుర్తించిన ప్రభుత్వం సత్వరమే పెన్షన్ పంపిణీకి చర్యలు చేపట్టింది. పెన్షన్ కోసం వచ్చే వారికి ఆలస్యం చేయకుండా వెనువెంటనే సొమ్ము అందజేయాలని సంబంధిత సచివాలయాల సిబ్బందిని ఆదేశించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి చేపట్టిన పెన్షన్ల పంపిణీ గురువారం నాటికి విశాఖలో 92.68 శాతం, అనకాపల్లిలో 85.05 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 75.25 శాతం మందికి అందజేశారు. శుక్రవారం నాటికి విశాఖలో 95.03 శాతం, అనకాపల్లి జిల్లాలో 93.34 శాతం, అల్లూరి జిల్లాలో 93.71 శాతం మందికి పంపిణీ జరిగింది. మిగిలిన వారికి శనివారం రాత్రి 7 గంటల్లోపు చెల్లించనున్నారు. మరోవైపు మంచాన పడిన వారికి, దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది నేరుగా వారి ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు.

సంతృప్తికరంగా సేవలు



వలంటీర్‌గా ఐదేళ్ల పాటు నా పరిధిలో కుటుంబాలకు సంతృప్తికరంగా సేవ లందించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలంటీర్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందేలా వ్యవస్థను డిజైన్ చేసిన సీఎం జగన్ విజన్ గొప్పది. మళ్లీ వలంటీర్‌గా వస్తా.

– అప్పికొండ కృష్ణ, వలంటీర్, ఎగువపేట

జగనన్నే మా నమ్మకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా నమ్మకం. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఐదేళ్ల పాటు ఇంటింటికీ అందించాను. నా పరిధిలో కుటుంబాలకు ఎంతో సేవ చేశాను. ప్రజలకు ఎంతో మేలు చేసిన సీఎం జగన్‌కు అండగా ఉండేందుకు వలంటీర్‌గా రాజీనామా చేశాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్‌గా చేరి.. ఈ సేవలను కొనసాగిస్తా.

–జశ్వంత్, రాజీవ్‌నగర్

తొలి సంతకం.. ఆనందం



తానాం క్లస్టర్–14లో వలంటీర్‌గా విధులు నిర్వర్తించా. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి అవస్థలు పడకుండా వారికి ఒకటో తేదీన ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించా. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావడం ఖాయం. 2024లో ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ తొలి సంతకం చేస్తానని చెప్పడం నాకెంతో ఆనందం కలిగించింది.

– దుంగల భారతి, తానాం

నవశకం సంక్షేమ సంతకం


రాతి చెరువు టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

టిడ్కో నాడు 0 నేడు 16,420


2019 మార్చి 20 నాటికి యలమంచిలిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పరిస్థితి



ప్రస్తుతం యలమంచిలిలో పూర్తయిన టిడ్కో ఇళ్లు

ఇదీ తేడా..

టీడీపీ ప్రభుత్వం(2014-19)	వైఎస్సార్ సీపీ ప్రభుత్వం(2019-24)
ఇల్లు పేరుతో జనం జేబు గుల్ల చేసిన టీడీపీ	ఒక్క రూపాయికే 300 గజాల ఇల్లు రిజిస్ట్రేషన్
ఒక్క టిడ్కో ఇల్లు ఇవ్వకుండా కాలయాపన	ఇప్పటివరకు 16,420 ఇళ్లను అందజేసిన ప్రభుత్వం 90 శాతం సౌకర్యాలతో మరో 10 వేల ఇళ్లు పూర్తి
కనీస వసతులు కల్పించకుండానే ఎన్నికల ముందు హడావిడి	ప్రతి ఇంటినీ పక్కా నిర్మించి లబ్ధిదారులకు అందజేత
టీడీపీ వారికే ప్రథమ ప్రాధాన్యం	అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయింపు
లబ్ధిదారులపై మోపిన భారం రూ.1284.02 కోట్లు	మాఫీ చేసిన మొత్తం రూ.1284.02 కోట్లు
ఇళ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు రూ.354.55 కోట్లు	ఇళ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు రూ.1004.37 కోట్లు

సాక్షి, విశాఖపట్నం/ఎంవీపీకాలనీ/గాజువాక/పెదగంట్యాడ/ కంచరపాలెం/ దాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వ పథకం.. ఆపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం.. రెండు కలిస్తే బంగారు కలల గృహం సొంతమవుతుందని ఎవరైనా భావిస్తారు. కానీ.. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం.. పేదల ఇళ్లల్లోనూ దోపిడీ పర్వాన్ని కొనసాగించింది. అప్పటి ధరల ప్రకారం అడుగు రూ.వెయ్యి కూడా చేయని ఇంటిని రూ.2 వేలకు అంటగడుతూ సొంత లాభం మిగుల్చుకునేందుకు కుతంత్రాలు పన్నింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పోనూ మిగిలిన రుణభారం మొత్తం పేదలే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఇళ్లలోనూ లబ్ధిదారుల ఎంపిక ఓ ప్రహసనంలా మార్చేసింది. పసుపు కండువా వేసుకున్న వారికే టిడ్కో ఇల్లు అన్నట్లుగా వ్యవహరించింది. దీంతో అసలైన లబ్ధిదారులకు సొంతింటి కల.. కలగానే మిగిలిపోయింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల మంది సొంతింటి కలని నెరవేర్చింది. అరకొరగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టి లబ్ధిదారుల చేతికి తాళాలు అందించింది. ఓ వైపు నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు పేరుతో లక్షలాది మంది సొంతింటి కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్.. ప్రజా సంకల్పయాత్రలో మాట ఇచ్చినట్లుగా.. 300 చ.అడుగల ఇళ్లని ఒక్క రూపాయికే అందించి గొప్ప మనసు చాటుకున్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారులపై మోపిన రుణభారాన్ని సైతం తగ్గించారు.

ఇల్లు పేరుతో దోపిడీ పర్వం

అర్బన్‌లో నివసించే ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే తలంపుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రవేశపెట్టిన పథకం అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టు. టిడ్కో పేరుతో రూ.6 లక్షలకు ఓ ఇల్లు చొప్పున నిర్మించి ఇస్తున్నారు. ఇందులో రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రూ.3 లక్షలు లబ్ధిదారులు చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. ఇందులో రూ.50 వేలు ముందుగా చెల్లిస్తే మిగిలిన రూ.3 లక్షలు లబ్ధిదారునికి బ్యాంకుల నుంచి రుణం అందించాలన్న నిబంధన విధించారు. ఆ అప్పును లబ్ధిదారుడే చెల్లించుకోవాల్సి ఉంటుంది. అదే దరఖాస్తుదారుడికి స్థలం ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షలు రాయితీ ఇస్తాయే తప్ప.. బ్యాంకుకి సంబంధించిన రుణ బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకోలేదు. అయితే పేదలకు అందాల్సిన ఫలాల్లోనూ టీడీపీ నేతలు హస్తలాఘవం చూపించారు. బహుళ అంతస్తులుగా నిర్మిస్తున్న భవనాల్లో అసలైన లబ్ధిదారులకు మాత్రం చోటు లేకుండా.. పార్టీ కార్యకర్తలు, అనుయాయులకే ప్రాధాన్యమిచ్చారు.

టీడీపీ గుర్తింపు కార్డే అర్హత పత్రంలా..

దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్ కార్డుదారులు, ఇంతవరకూ ఎక్కడా ఇల్లు లేని వారు ఈ పథకానికి అర్హులు. కానీ తెలుగుదేశం హయాంలో ఈ పథకానికి అర్హత పొందాలంటే.. వారు టీడీపీకి చెందిన వారై ఉండాలి.

దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉండేది. టీడీపీకి సంబంధించిన వారినే లబ్ధిదారులుగా గుర్తించారు. టీడీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జీవో జారీ చేస్తూ.. ఎమ్మెల్యే, జన్మభూమి కమిటీల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం కట్టబెట్టడంతో పథకం మొత్తం టీడీపీ కార్యకర్తల చుట్టూనే తిరిగింది.

‘ప్రజా సంకల్ప యాత్ర’లో జగన్ అభయం

లబ్ధిదారులు ముందుగా రూ.50 వేలు చెల్లించాలి. మిగిలిన రూ.3 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుంది. ఈ రుణాన్ని చెల్లించాల్సింది లబ్ధిదారుడే. దీంతో ఈ గృహాలకు దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది వెనుకంజ వేశారు. 2018 జూలై వరకు గ్రేటర్ పరిధిలోని 8 నియోజకవర్గాల్లో 83,247 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఎప్పుడైతే అర్బన్ హౌసింగ్ పేరుతో చంద్రబాబు సర్కారు, ఎమ్మెల్యేలు చేస్తున్న దగాను ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడుతూ.. రుణాలపై అనుకూల ప్రకటన చేశారో.. అప్పటి నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. రుణ భారాన్ని తమ ప్రభుత్వం వచ్చాక మాఫీ చేస్తామని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖలో ఆగస్టు 18న ప్రకటించారు. ఆ తర్వాత ఆరు నెలల్లోనే 1,44,589 దరఖాస్తులు వచ్చాయంటే.. జగన్ మాటకు ప్రజల్లో ఎంతటి విశ్వసనీయత ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేశారు.

పంపిణీకి సిద్ధంగా మరో 10,028 ఇళ్లు


సత్యనారాయణపురం టిడ్కో ఇళ్ల సముదాయం

నాడు ఒక్కటీ లేదు.. నేడు 16,420 అందజేత

ఉమ్మడి విశాఖ పరిధిలో 26,448 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో 2019 వరకు 1000 ఇళ్లని లబ్ధిదారులకు కేటాయించామని చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారు. కానీ నీటి సౌకర్యం, రోడ్లు, మౌలిక వసతులేవీ కల్పించకుండా.. కేవలం టీడీపీ లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించి.. భుజాలు చరుచుకున్నారు. వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో ఏ ఒక్కటి పూర్తి చేయలేకపోయింది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. ప్రతి ఇంటికీ వీలైనంత త్వరగా సమగ్ర మౌలిక వసతులు కల్పించి అప్పగించాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. చంద్రబాబు హయాంలో ఒక్కరంటే ఒక్కరికి పూర్తి సౌకర్యాలున్న టిడ్కో ఇంటిని అందివ్వలేకపోగా.. సీఎం వైఎస్ జగన్ హయాంలో ఏకంగా 16,420 మందికి ఇళ్లు కేటాయింపులు, గృహ ప్రవేశాలను పండగలా నిర్వహించారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి విశాఖలో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం కేవలం రూ.354.55 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మధ్యలోనే పనులు విడిచిపెట్టేశారు. కానీ.. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1004.37 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేశారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ప్రతి ప్రాంతంలోనూ నిర్మాణాలను పర్యవేక్షించి.. అద్భుతంగా ఇళ్లను పూర్తి చేయించారు.

రుణ భారం దించేసిన జగన్ సర్కార్

ఇళ్లు తక్కువ ధరకే ఇస్తున్నామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రభుత్వం.. 300 చ.అడుగుల ఇంటిపై రూ.50 వేలు, 365 చ.అ. ఇంటిపై రూ.2.50 లక్షలు, 430 చ.అడుగుల ఇంటిపై రూ.3 లక్షల రుణభారాన్ని లబ్ధిదారులపై మోపింది. దీంతో.. ముందుగా డీడీలు చెల్లించిన వారంతా ఇల్లు రాక, రుణాలు తీర్చలేక అష్టకష్టాలు పడ్డారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జీవీఎంసీతో పాటు నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల పరిధిలోని లబ్ధిదారులకు ఏకంగా రూ1284.02 కోట్లను మాఫీ చేసి.. వారి కళ్లల్లో వెలుగులు నింపారు.

అంశం	జీవీఎంసీ	యలమంచిలి	నర్సీపట్నం	మొత్తం
మంజూరైన టిడ్కో ఇళ్లు	24,192	432	1,824	26,448
టీడీపీ హయాంలో కేటాయించిన టిడ్కో ఇళ్లు	00	00	00	00
వైఎస్సార్ సీపీ హయాంలో అందజేసిన ఇళ్లు	14,832	432	1,156	16,420
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	9,360	00	668	10,028
2014-19లో చేసిన ఖర్చు (రూ.కోట్లలో)	311.33	6.65	36.57	354.55
2019-24లో చేసిన ఖర్చు (రూ.కోట్లలో)	921.99	20.88	61.5	1,004.37
ప్రభుత్వం భరించిన రుణభారం(రూ.కోట్లలో)	1,175.63	20.71	87.67	1284.02

మా బతుకుల్లో వెలుగులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం పేదలకు వరం. ముఖ్యంగా ఇళ్ల కేటాయింపుల విషయంలో శరవేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. నాకు దబ్బందలో టిడ్కో ఇల్లు మంజూరైంది. దశాబ్దాల కల నెరవేరింది. దివ్యాంగ పింఛన్ లభిస్తోంది. నాలాంటి ఎందరో జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారు.

– కుప్పల రమేష్, ఆదర్శనగర్

సొంతింటి కల నెరవేరింది



కంచరపాలెం పరిధి రాజీవ్‌కాలనీ మురికివాడలో నివసించేవాళ్లం. నా భర్త రాజు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో పాకలు తొలగించడంతో అతి కష్టంమీద రేకుల షెడ్డు నిర్మించుకున్నాం. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కంచరపాలెం రాజీవ్‌కాలనీలో టిడ్కో ఇల్లు మంజూరు చేశారు. ఇటీవల రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మా సొంత ఇంటి కలను సీఎం జగన్ నిజం చేశారు. మా అమ్మకు ప్రతి నెలా పింఛన్, నా పిల్లలకు అమ్మఒడి వస్తోంది.

– సునారి రజని, రాజీవ్‌కాలనీ, కంచరపాలెం

కలలో కూడా ఊహించలేదు



మా సొంతూరు అమలాపురం. బతుకుదెరువు కోసం 24 ఏళ్ల కిందట గాజువాక వచ్చేశాం. నా భర్త ప్రభాకర్ మొదట ఆటోనగర్‌లో.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నారు. టిడ్కో ఇల్లులోకి మారకముందు వడ్లపూడిలో అద్దెకు ఉండేవాళ్లం. ఏడాదంతా పని చేస్తే నా భర్తకు రూ.1.50 లక్షల వరకు జీతం వస్తుంది. అందులో రూ.66 వేలు అద్దెకే పోయేది. మిగిలిన డబ్బుతో కుటుంబాన్ని నడపడం చాలా కష్టంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో సీఎం జగన్ మాకు మంగళపాలెంలో టిడ్కో గృహం మంజూరు చేశారు. సొంతింటి కల నెరవేరడంతో పాటు అద్దె కష్టాలు తీరాయి.

– సాపే ఆనంద కృష్ణకుమారి, మంగళపాలెం, దువ్వాడ

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాది శ్రీకాకుళం.. 30 ఏళ్ల కిందట బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చాం. నాకు ఇద్దరు కుమార్తెలు. నా భర్త రవికుమార్ హోటల్‌లో పని చేస్తున్నారు. నాటి నుంచి అద్దె ఇళ్లలోనే ఉంటున్నాం. ఇప్పుడు టిడ్కో ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. భానోజీతోటలో ఇల్లు రావడంతో మా కల ఫలించింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ మా ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు తీసుకున్నారు. తర్వాత ఇల్లు మంజూరైంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– దేవరశెట్టి లక్ష్మీ, దయాల్‌నగర్, పెదగంట్యాడ

చాలా సంతోషంగా ఉంది



సీహార్స్ జంక్షన్ వద్ద సుమారు 30 ఏళ్లకు పైగానే నివసిస్తున్నాం. ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలుగుదేశం ప్రభుత్వం పదేళ్ల కిందట మమ్మల్ని ఖాళీ చేయించింది. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోగా.. ఇంటి కోసం కాళ్లరిగేలా తిరిగాం. కనీసం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటిని నిర్మించి అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– వియ్యాపు అప్పలకొండ, రామకృష్ణనగర్, జీవీఎంసీ 35వ వార్డు

పోర్టులో ఘనంగా జాతీయ మారిటైం వేడుకలు

విశాఖ సిటీ : విశాఖ పోర్టు అథారిటీలో జాతీయ మారిటైం దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కన్జర్వేటర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోర్టులో విశేష సేవలందించి అసువులు బాసిన సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం పోర్టు ఫ్లీట్ ఆఫ్ టగ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వృద్ధిలో సముద్రయాన రంగం కీలక భూమిక పోషిస్తోందన్నారు. మేజర్ పోర్టులలో అత్యధికంగా సరుకు రవాణా చేస్తూ విశాఖ పోర్టు సముద్రయాన రంగంలో తనదైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. మారిటైం దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేష్ మిట్టల్, హెచ్ఐఎంటీ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

సచివాలయ కార్యదర్శులకు వేధింపులు


గుడాల జగన్నాథరావు

గోపాలపట్నం: సచివాలయం అధికారులను బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్న రౌడీషీటర్ గుడాల జగన్నాథరావును గోపాలపట్నం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం పరిధిలో భవన నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేసి ఇవ్వాలని నిత్యం వేధిస్తున్నట్లు పలు సచివాలయాల కార్యదర్శులు కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీపీ రవిశంకర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. అనంతరం సీపీని కార్యదర్శులు కలిసి ఫిర్యాదు అందించారు. ఆ ఫిర్యాదును ఆయన పెందుర్తి, గోపాలపట్నం పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. విచారణ ప్రారంభించిన గోపాలపట్నం పోలీసులు.. అన్ని ఆధారాలు ఉండటంతో జగన్నాథరావును అరెస్ట్ చేశారు. అతని వల్ల ఎవరైనా ఇబ్బందులు పడి ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సీఐ సురేష్ కోరారు.

రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా స్టేషన్ల మధ్య స్పెషల్ రైళ్లు (వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు.

- ఎర్నాకుళం–బ్రహ్మపూర్(06087) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈనెల 6,13,20,27, మే 4,11,18,25వ తేదీల్లో (శనివారాలలో) రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–ఎర్నాకుళం (06088) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈనెల 8,15,22,29, మే 6,13,20,27వ తేదీల్లో (సోమవారాలలో) మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- చెన్నై ఎగ్మోర్ –సంత్రగచ్చి (06077) స్పెషల్ రైలు చెన్నై ఎగ్మోర్‌లో ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18, 25వ తేదీలలో (శనివారాలలో) రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు (సోమవారాలలో) ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి- చెన్నై ఎగ్మోర్ (06078)స్పెషల్ సంత్రగచ్చిలో (పతీ సోమవారాలలో) ఈనెల 15,22,29, మే 6,13,20,27వ తేదీల్లో ఉదయం 10గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.48 గంటలకు దువ్వాడకు అదేరోజు మధ్యాహ్నం 3.30గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.
- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(06073) స్పెషల్ మే 6,13,20,27, జూన్ 3వ తేదీలలో(సోమవారాలలో) రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15గంటలకు దువ్వాడకు అదేరోజు సాయంత్రం 6.30గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–చెన్నై సెంట్రల్(06074) భువనేశ్వర్‌లో మే 7,14,21,28 జూన్ 4వ తేదీలలో(మంగళవారాలలో) రాత్రి 9గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.42గంటలకు దువ్వాడకు మధ్యాహ్నం 3గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న ఏసీపీ బి.సునీల్

కొమ్మాది: బీచ్‌రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలానికి చెందిన అజుమూరి మహేశ్వరరావు దివీస్‌లో కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వైజాగ్ వెళ్లి తిరిగి వస్తుండగా బీచ్‌రోడ్డు తొట్లకొండ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహేశ్వరరావు తలకు తీవ్రగాయమై రోడ్డు పక్కన పడిపోయాడు.

స్పందించిన ఏసీపీ

బీచ్‌రోడ్డు విజిట్ కోసం అటుగా వస్తున్న ఏసీపీ బి.సునీల్ రోడ్డు పక్కన పడిపోయి ఉన్న మహేశ్వరావును గమనించాడు. వెంటనే తన వాహనంలో మహేశ్వరరావును దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్వరరావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏసీపీ సునీల్ స్పందించిన తీరును పలువురు అభినందించారు.